# కృష్ణావతారం

## మినీ కథ



**కొల్లి కిషోర్**

బజర్ నొక్కింది రాధ...మిసెస్ కృష్ణ. డోర్ తెరుచుకుని లోపలికి వచ్చింది చెలికత్తె. ఏమిటి విషయం అన్నట్లు రాధవంక చూసింది. "నువ్వు తొందరగా వెళ్ళి కృష్ణ గారిని వెంటబెట్టుకునిరా...ఆయన ద్రాక్ష తోటలో ఉన్న గెస్ట్ హౌస్‌లో ఉంటారు. మారుతీకార్‌లో వెళ్ళు" అంది రాధ. ఆయన గెస్ట్ హౌస్‌లో ఉన్నారంటె...సత్యభామ దగ్గర ఉన్నట్లులెక్క. "గెస్ట్‌హౌస్‌కు వెళ్ళగానే ఏ విషయం ఫోన్ చెయ్యి" ఆఖరిగా చెప్పింది రాధ.

ఎయిర్ కండిషనర్ చేస్తున్న శబ్దం తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది. విరహం...శరీరాన్ని ట్లాన్స్‌ఫర్నేస్‌లో ఉంచినట్లుగా వేడి... "మన్మధరావ్" బాణాలు తన శరీరాన్ని మరింత హింసిస్తున్నాయ్. ఆయన అమెరికా వెళ్ళి, అక్కడ మన్మధబాణాలు వెయ్యటంలో డాక్టరేట్ తీసుకున్న తర్వాత నుండి ఈ విరహం ఎక్కువయింది. అంటె "మన్మధరావ్" ప్రజ్ఞ పెరిగింది.

ఇక ఆగలేక ఫోన్ ఎత్తి గెస్ట్ హౌస్ నెంబర్ రింగ్ చేసింది. ఎంగేజ్..."ఎంగేజ్డ్". ఇలా కాదని టెలిఫోన్ ఎక్స్‌చేంజ్‌కు కాల్‌చేసి, గెస్ట్‌హౌస్ నెంబర్‌చెప్పి "లైన్" విషయం అడిగింది. "అక్కడ రిసీవర్‌తీసి క్రింద పెట్టేశారు" అటు నుండి ఆపరేటర్ గొంతు.

"ఇది ఆ 'సత్యభామ' ఐడియా అయి వుంటుంది" అనుకుంది రాధ. గోడ మీద కృష్ణుడికు ఇష్టమయిన అర్ధనగ్న సుందరీమణుల ఫోటోలు తనను హేళన చేస్తున్నట్లుగా వుంది రాధకు.

ఇంటర్ కమ్‌లో "కుక్"ను పిలిచి "ఓ నెస్‌కాఫీ" చెప్పి సోఫాలో రిలాక్సయింది.

"రాధా నువ్వే నా ప్రాణం" అంటూ ఇక్కడ ఉన్నపుడు తన నామస్మరణ చేసే కృష్ణుడు, గెస్ట్ హౌస్‌లో ఉన్న "సత్య"ను చూడగానే తనని మర్చిపోయి ఉంటాడు. "ఈ మగజాతి అంతే" అనుకుంది రాధ.

కాఫీ తాగి బాత్‌రూమ్‌లోనికి నడిచింది. షవర్ ఆన్ చేసి నిలబడింది. అభ్యంగ స్నానం చేసింది. స్కైబ్లూ కలర్ శారీ... మ్యాచింగ్ బ్లౌజ్ వేసుకుని, కొద్దిగా సెంట్, స్ప్రే చేసుకుంది.

ఏమి తోచక వి.సి.ఆర్ ఆన్ చేసింది. ఏదో సినిమా వస్తోంది. హీరో, హీరోయిన్‌లు బృందావన్ గార్డెన్స్‌లో పాట పాడుతూ గెంతులేస్తున్నారు. రాధ మనస్సు గతంలోకి వెళ్ళింది. ఆ రోజులే వేరు. మొన్న తాము బృందావనానికి వెళ్ళి అక్కడ "మురళి" వాయిస్తూ నర్తిస్తూ ఉంటే, తోటమాలివచ్చి "నా తోట పాడుచేస్తున్నారు," అని గొడవ చెయ్యాలా!!!

అలాగంట గడిచింది, ఇకతానే వెళదామని, కార్‌డోర్ లోకివస్తే, "బెంజ్"కారు ఉంది గాని ఆ రోజు డ్రైవర్ శెలవ్. ఛీ... అంతా ఎదురే...

చెలికత్తెకు అడ్రస్ తెలియలేదా? అవును...ఆ చెలికత్తెను నిన్ననే అపాయింట్ చేసుకుంది. రాధ ఆలోచనలలో ఉండగానే ఇందాకటి "మారుతీ"కారు వస్తూ కన్పించింది. అయితే లోపల చెలికత్తె లేదు.

"ఏమిటి విషయం" డ్రైవర్‌ను అడిగింది. వాడికళ్ళలో నీరు...మొహంలో కోపం...జరిగింది చెప్పాడు.

"కృష్ణుడు" కొత్త చెలికత్తె అందాన్ని చూసి మోహించాడట. అసలే గోపికాలోలుడుకదా!! ఐతే ప్రాబ్లమ్ఏంటంటే, ఈ డ్రైవర్, ఆ చెలికత్తె అదివరకటి నుండి ప్రేమించుకున్నారట. కృష్ణుడిని చూడగానే వీడికి "బై" చెప్పి ఆయనతో "హనీమూన్"కు వెళ్ళిందట.

నిరుత్తురాలై నుంచుండిపోయింది రాధ.

(ఈ కథ కేవలం హాస్యం కోసం తప్ప ఎవరినీ కించపరచడానికి రాసింది కాదని మనవి.)